కథ

# లొంగుబాటు

సునీత

'ఇదిగో వింటున్నారా... నిన్న కొత్తపేటలో ఓ ముసలావిడను ఎవరో గొంతుపిసికి చంపేశారట. ఆమె భర్త ఉద్యోగానికి వెళ్లినపుడు ఇది జరిగిందట' సీతారామయ్యకు కాఫీ ఇస్తూ చెప్పింది జానకమ్మ.

'పోనీలేవే ఇకనైనా ఆ ముసలాడు ప్రశాంతంగా బతుకుతాడు' కొంటెగా అన్నాడు సీతారామయ్య.

'ఆ పరాచికాలే వద్దనేది. అసలు నేను చెప్పినదేమైనా గుర్తుందా...' అందామె.

'ఆ అదెలా మర్చిపోతానే... ఇవ్వాళ సాయంత్రం మంచి నేవళంగా వున్న వంకాయలు తెస్తే రేపు నాకిష్టమైన గుత్తొంకాయ చేస్తానని నిన్న చెప్పావుగా' అన్నాడు సీతారామయ్య.



'అయ్యో రాత... తిండి తప్ప మనకు ఇంకేం గుర్తుంటుందిలే. అయినా నన్ననాలి. మీరిట్లా డొంకతిరుగుడుగా మాట్లాడతారని తెలిసీ మీతో నాగోడు చెప్పుకుంటున్నానుగా' కుర్చీలోనుంచి లేచి వంటింట్లోకి వెళ్లడానికి సిద్ధమైంది జానకమ్మ.

'అదికాదు జానకీ... ఇల్లు అద్దెకివ్వడానికి మనకేం అవసరమే.. వచ్చేవాళ్లు ఎలాంటి వాళ్లు వస్తారో... వాళ్లతో లేని పోని పేచీలు. ఇవన్నీ మనకు ఈ వయసులో ఎందుకు చెప్పు. మనం అద్దె ఇంట్లో ఎన్ని అగచాట్లు పడ్డామో మర్చి పోయావా... ఇకనైనా ప్రశాంతంగా బ్రతుకుదాం' అనునయంగా అన్నాడు సీతారామయ్య.

'ఆ.. ఆ... అప్పుడు మనం ఇంటి ఓనర్ల వల్ల ఇబ్బందులు పడ్డాం. మనమేమీ ఇబ్బంది పెట్టలేదుగా... మనం అట్లా ఇబ్బంది పెట్టకపోతే చాలు.. అయినా వున్న ఇద్దరు పిల్లల్నూ ఆ పాడు అమెరికా లాక్కుపోయింది. మీరేమో దుకాణం అంటూ పొద్దున వెళ్లి రాత్రికి తిరిగొస్తారు. లంకంత ఇంట్లో బిక్కు బిక్కుమంటూ వుండాల్సింది నేనే... నేను పడుతున్న అవస్థ లేవీ మీకు పట్టనే పట్టవు. ఆ మూలనున్న మూడుగదులూ ఎవరికైనా ఇస్తే నాక్కాస్త కాలక్షేపమంతే... అంతేగానీ అద్దెకోసమేమీ కాదు' కోపంగా అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది జానకమ్మ.

పడక్కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతూ ఆలోచనలో పడ్డాడు సీతారామయ్య. 'జానకి చెప్పిందీ నిజమే.. ఆమెకేం తోస్తుంది పాపం. అద్దెకిస్తే పోయె. నచ్చకపోతే ఖాళీ చేయమని చెపితే సరిపోతుంది'. ఆ మూడు గదుల్నీ అద్దెకు ఇవ్వడానికి నిర్ణయించుకున్నాడాయన.

అనుకున్నదే తడవుగా ఓ అట్టముక్క మీద 'టు లెట్' అని రాయడం మొదలెట్టాడు.

ఏదో పనిపైన వంటింటినుంచి బయటకు వచ్చిన జానకమ్మ ఈ దృశ్యం చూసింది. ఆమెలో సంబరం మొదలైంది.

'ఏమండీ ఎక్కువమంది వున్న వాళ్లకు ఇద్దామండీ. పిల్లలుంటే మరీ మంచిది. ఆడుకోవడానికి వాళ్లకు మన ఆవరణ అంతా సరిపోతుంది. సందడిగా కూడా వుంటుంది. కాస్త నా వయసువాళ్లూ వుంటే కబుర్లాడుకోవచ్చు' పురాణం మొదలెట్టింది.

'అబ్బా రానివ్వవే.. ఎవరికి పడితే వాళ్లకు ఇల్లు ఇస్తే ఇల్లు గుల్లవుతుంది. ఎవరో ఎలాంటివారో చూసుకుని మరీ ఇవ్వాలి. అంతేగానీ వచ్చిన వాళ్లకంతా ఇల్లిస్తామని మాత్రం చెప్పద్దు' హెచ్చరించాడాయన.

'సరేలేండి' అంది జానకమ్మ ఆయన ఒప్పుకుందే చాలనుకుంటూ..

మూడు రోజుల పాటు ఎవరూ రాకపోయే సరికి ఆవిడ డీలా పడిపోయింది. 'అదేంటండీ బోర్డు పెట్టి ఎన్ని రోజులైనా ఇంకా ఎవరూ ఇల్లే అడగలేదు. ఇదేం వింత' అనుకుంటూ నిష్టూరపోయింది.

'కాలాలు ఇంతకు ముందులా లేవే... గతంలో ఇన్ని ఇళ్లు వుండేవి

కాదు. ఇప్పుడైతే అన్నీ అపార్ట్‌మెంట్లే' అన్నాడు సీతారామయ్య.

అయితే మరుసటి రోజు నుంచీ ఆవిడ ముచ్చట తీరుస్తూ ఓ వ్యక్తి వచ్చాడు ఇంటికోసం.

అయితే అతని వాలకం బాలేదంటూ సీతారామయ్య తిరగ్గొట్టాడు.

జానకమ్మకు కోపం వచ్చినా ఆపుకుంది. కోప్పడితే అసలుకే మోసం వస్తుందన్న ఆలోచనతో..

రోజూ ఇలా ఇంటికోసం ఎవరో ఒకరు రావడం వారు సీతారామయ్యకు నచ్చకపోవడం ఆమెకు విసుగు పుట్టించింది.

'ఇదిగో నాకోసం బోర్డు పెట్టారుగానీ ఇల్లిచ్చే ఉద్దేశం లేనేలేదని అర్థం అయిపోతోంది. ఇలాంటి డొంక తిరుగుడు పనులెందుకూ...' విరుచుకుపడిం దాయనమీద ఓ రోజు.

అది జరిగిన ఓ పది రోజులకు భార్యాభర్తలిద్దరూ భోజనం చేసి వరండాలో చేరి కబుర్లు చెప్పుకుంటుం డగా గేటు చప్పుడైంది. తిరిగి చూశారిద్దరూ...

ఓ యువతి గేటు తీసి లోపలికొస్తోంది. తెల్లగా, సన్నజాజి తీగెలా వుంది. మెడలో నల్లపూసల గొలుసు, కాలి మట్టెలు ఆమెకు మరింత అందాన్నిస్తు న్నాయి. ఎండన పడి రావడంతో కమిలినట్లుగా, అల సటగా కనిపిస్తోంది.

'టులెట్ బోర్డు పెట్టారు. ఇంటిని అద్దెకిస్తారా' సందేహంగా అడిగిందామె.

'ఆ అందుకే పెట్టామమ్మా...' భర్త నోరు తెరిచే ముందే అందుకుని చెప్పింది జానకమ్మ.

'మీరు ఎంతమందుంటారమ్మా.' అడిగారు సీతారామయ్య

'నేనూ, మా ఆయనేనండీ' అందా అమ్మాయి.

'లోపలికి రామ్మా. ఎండన పడి వచ్చావు. కాస్త మంచినీళ్లు తాగుదువుగానీ' కుర్చీ ముందుకులాగి ఆహ్వానించింది జానకమ్మ.

మొహమాటపడుతూ వచ్చి కూర్చుంది ఆ అమ్మాయి.

'నీ పేరేంటమ్మా' లోపలికెళుతూ అడిగింది జానకమ్మ

'మధు... మధుమతండీ..' సమాధానం ఇచ్చిందామె

'మీ వారి పేరేంటన్నావమ్మాయ్' అడిగాడు సీతారామయ్య.

'శ్రీనివాసండీ' అందామె.

లోపలికెళ్లిన జానకమ్మ ఓ చెవి ఇటేసి అంతా వింటూనే వుంది.

'అసలే భయస్తురాలిలా వుంది. అలాంటి పిల్లను యక్షప్రశ్నలేసి చంపుకు తింటున్నారు' విసుక్కుం దామె.

సీతారామయ్య మధుమతిమీద ప్రశ్నల వర్షం కురి పిస్తుండగానే మంచినీళ్లతో పాటు కాఫీ కూడా తీసు కుని వచ్చింది.

'ఇదిగో అమ్మాయ్ ఆయన మాటలకేంగానీ ఈ మంచినీళ్లు, కాఫీ తీసుకో' అంది.

'అబ్బే వద్దండీ' మొహమాటంగా అంది మధుమతి.

'తీసుకోమ్మా' ఫరవాలేదు' అంటూ ఇచ్చిందామె.

'మాది లవ్ మ్యారేజండీ. పెద్దవాళ్లకు ఇష్టం లేదు. మేమిద్దరమే వుంటాము. అప్పుడప్పుడూ స్నేహి తులు వచ్చి వెళుతుంటారంతే' కాఫీ కప్పు నోట్లో పెట్టుకోకుండానే చెప్పిందా అమ్మాయి.

'ఫర్లేదులేమ్మాయ్. మేమున్నాంగా అంటూ' కోరగా చూస్తున్న భర్తవైపు చూసి నాలుక్కరుచుకుంది.

కాఫీతాగి కింద పెట్టి 'వెళతానండీ' అంటూ లేచిందా అమ్మాయి.

'ఇదిగో అమ్మాయ్... అద్దె రెండువేలు. అడ్వాన్స్ ఆరువేలు... ఇచ్చుకోగలరా.. అయినా ఏ విషయం రేపు చెపుతాం. ఓసారి వచ్చి కనిపించు' అన్నాడాయన.

'దీన్నికూడా తిరగ్గొట్టేద్దామనుకున్నారేమో.. అదేం కుదరదు... వాళ్లకు ఇల్లివ్వాల్సిందే..'

మధుమతిని గేటువరకూ సాగనంపి తిరిగివస్తూ కేకలేసింది జానకమ్మ.

సీతారామయ్య సమాధానం ఇవ్వకుండా పేపర్లో తల దూర్చాడు.

'మధుమతిని చూస్తే రాధిక గుర్తొచ్చిందండీ' అందామె అమెరికాలో వున్న కూతుర్ని తలచుకుంటూ...

'నాక్కూడా... ఆ అమ్మాయి గేటు తీసుకుని లోని కొస్తుంటే రాధిక రావడమేంటా అని ఆశ్చర్యమే సింది తెలుసా' అన్నాడాయన.

'అవును మరి వయసు మీద పడింది. చత్వారం వచ్చేసి చూపానడం లేదు' వేళాకోళాలాడిందావిడ.

రాత్రంతా దంపతులు వారికి ఇల్లి వ్వడంపై తర్జన భర్జనలు పడి చివ రకు ఇవ్వాలనే తేల్చేసుకుని ప్రశాం తంగా నిద్రపోయారు.

మర్నాడు సీతారామయ్య దుకాణా నికి వెళ్లగానే వంటా వార్పూ పూర్తి చేసు కుని మధుమతి కోసం వేచిచూస్తూ కూర్చుంది జానకమ్మ.

మధ్యాహ్నం అవుతుండగా వచ్చిం దామె.

గేటు దగ్గర మధుమతి కని పించగానే ఆనందంగా ఎదురెళ్లింది జానకమ్మ.


'మీ బాబాయి ఇల్లు ఇవ్వడానికి ఒప్పుకున్నా రమ్మా. ఆయన్ను ఒప్పించడానికి నేనెంత కష్టపడ్డానను కున్నావ్. అయినా చాలా మంచి మనిషమ్మా. పైకలా వుంటారంతే..' వరసలు కలిపేసింది జానకమ్మ.

'అడ్వాన్స్ తీసుకోండి' బ్యాగులోంచి డబ్బులు తీసింది మధుమతి.

'డబ్బులకేం లేమ్మా.. ఇది మీ బాబాయి కోసమే సుమా. అసలే తల్లిదండ్రులకు దూరంగా వున్నారు. ఏదైనా అవసరమైతే అడుగు. మొహమాట పడబోకు అర్థమైందా.. ఇంతకీ ఇంట్లోకి ఎప్పుడొస్తారమ్మా' అడి గింది జానకమ్మ.

'మీరొప్పుకుంటే రేపే చేరుతాం' అంది మధుమతి.

'రేపా' అంటూ లోపలికెళ్లి క్యాలెండర్ తెచ్చి చూసింది. మంచి రోజే కావడంతో సంతృప్తి పడి



తలూపింది.

మరుసటిరోజు పొద్దునికల్లా భార్యాభర్తలిద్దరూ తమకున్న కొద్దిపాటి సరంజామాతో దిగిపోయారు. జానకమ్మ దగ్గరుండి వారి సామానంతా సర్దిపెట్టింది. టిఫిన్లు, కాఫీలు, భోజనాల తయారీలో, వారి ధ్యాసలో పడి భర్త గురించి పూర్తిగా మరచిపోయింది. తమ పిల్లలిద్దరూ వచ్చినంత హడావిడి చేస్తున్న ఆమెను చూసి నవ్వుకుంటూ వెళ్లిపోయారు సీతారామయ్య.

'అమ్మాయీ అబ్బాయీ చక్కగా చిలకాగోరింకల్లా వున్నారు. చక్కనిజోడీ కదా' అంది.

'అవునుగానీ... ఇంతకూ వాళ్లు అడ్వాన్స్ డబ్బులు ఇచ్చారా..' అన్నారాయన.

'మీకెప్పుడూ డబ్బులగోలే... మధుమతి నిన్నే ఇచ్చి వెళ్లింది. నేనే హడావిడిలో మీకివ్వడం మరిచిపోయాను..' అంది.

'అది కాదు జానకీ, వాళ్లిద్దరూ చిన్నపిల్లలు. పెద్ద ఉద్యోగాలేమీ కాదు. వున్న డబ్బులు కాస్తా మనకే ఇస్తే వాళ్ల పరిస్థితేంటి? కాస్తంత చూసుకో' అన్నారు.

జానకమ్మ మొహం వికసించింది. 'నేనున్నాగా... చూసుకుంటాలే' హామీ ఇచ్చింది.

ఇక జానకమ్మకు వారితోటిదే లోకమ్మైంది. నిరంతరం అమ్మాయీ, అల్లుడూ అంటూ వారి ధ్యాసే.. భర్త ఊసే మరచిపోయింది. జానకిరామయ్య పరిస్థితీ అంతే. పిల్లలకు దూరమ్మైన ఆ దంపతుల ఇల్లు కళకళలాడుతోంది. అమెరికా నుంచి కూతురూ, కొడుకూ ఫోన్ చేయడం లేదని దిగులు పడే జానకమ్మ వారు చేసినపుడు కూడా మొక్కుబడిగా మాట్లాడడం మొదలెట్టింది. వారితో మాటల్లోనూ మధు, శ్రీనివాస్‌ల గురించే. 'ఎవరమ్మా వాళ్లు. అందర్నీ నమ్మొద్దన్న' కొడుకు మాటలు ఆమెలో విసుగును రేకెత్తించడం మొదలెట్టాయి.

ఆరునెలలు ఆరుక్షణాల్లా గడిచిపోయాయి వారు నలుగురికీ...

'ఏమండీ అమ్మాయీ, అబ్బాయీ కనిపించడం లేదండీ. మీకేమ్మైనా చెప్పారా..?' ఓ రోజు పొద్దున్నే కంగారుగా పరిగెత్తుకొచ్చిందామె.

'లేదే నాకెందుకు చెపుతారు. అయినా ఎక్కడికో వెళ్లుంటార్లే ప్రతిదానికీ కంగారే నీకు' అన్నాడాయన.

'అదికాదు ఎప్పుడూ బయటకే వెళ్లని పిల్ల కనిపించడం లేదంటే దిగులేగా' అంది.

'వస్తార్లే...' అన్నారాయన.

సాయంత్రమ్మైనా వారి జాడలేదు. భార్యాభర్తలిద్దరూ వారికోసం వేచిచూస్తూ కూర్చున్నారు. భోజనం చేయడం కూడా మరిచిపోయారు. నాలుగు రోజుల గడచినా వారి జాడ లేకపోవడంతో భార్యాభర్తలిద్దరికీ దిగులు పుట్టింది. మరుసటి రోజు వెళ్లి పోలీసు రిపోర్టు ఇవ్వాలనుకున్నారిద్దరూ. వారి జాడ తెలుసుకుని వారి తల్లిదండ్రులే వారినిలా తీసుకెళ్లిపోయారని ఇద్దరూ స్థిర నిశ్చయానికొచ్చారు. అదే మేరకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. మధు, శ్రీను చెప్పిన ఊరిపేర్లు, తల్లిదండ్రుల పేర్లు మననం చేసుకున్నారు. సీతారామయ్య కాస్త ధైర్యంగా వున్నా జానకమ్మ మాత్రం పూర్తిగా డీలా పడిపోయింది. భోజనం చేయడమే మానేసింది. భార్యను ఓదారుస్తున్నా సీతారామయ్య పరిస్థితి కూడా అంతే...

'జానకీ' పొద్దున్నే భర్త గావుకేక విని 'పిల్లలొచ్చినట్టున్నారు' అని ఆత్రుతగా బయటకు వచ్చింది.

'ఇలా చూడు. మధు, శ్రీను ఎవరో తెలుసా' అన్నారు.

'నాకెలా తెలుస్తుందండీ, ఇంతకూ ఏం జరిగింది.' విస్తుపోతూ అడిగిందామె.

'వాళ్లిద్దరూ నక్సలైట్లే.. నిన్నే లొంగిపోయారట. చాలా కేసుల్తో వాళ్లిద్దరికీ సంబంధం వుందట...' అన్నారు ఆయన.

జానకమ్మ నమ్మలేనట్లు చూసింది. 'అదంతా అబద్ధాలే.' కొట్టిపారేసిందావిడ.

'లేదు పేపర్లో ఫోటోలు కూడా వేశారు చూడు' చూపించారాయన.

ఫోటోలు చూసి దిగ్భ్రాంతి చెందిందావిడ. వెర్రిదానిలా చూసింది. స్పృహకోల్పోయి దబ్బున కింద పడిపోయింది. తిరిగి ఆమెకు ఆస్పత్రిలో మెలకువ వచ్చింది. కళ్లు తెరవగానే తననే ఆత్రంగా చూస్తున్న భర్త, తమ్ముడు, మరదలు, మరిది తోడికోడలూ అందరూ కనిపించారు. ఎలావుందంటూ పలకరించారు. జానకమ్మకు దుఃఖం ముంచుకొచ్చింది.

పిల్లలు దూరమయ్యారని ముక్కూముఖం తెలియని వారిపైన ప్రేమ పెంచుకుంటే వారు తనను మోసం చేశారన్న భావన ఆమెను వేధిస్తోంది.

'మరోసారి ఆ పిల్ల కనిపించిందో చెంప పగల గొడతా. చంపేస్తుందా చంపేయ్యనీ' అరిచిందావిడ.

'ఛీ అయినా అది అలాంటిది కాదు' మళ్లీ సమాధాన పరచుకుంది.

'ఎందుకక్కా అట్లా చేశావు. ఇప్పుడు చూడు ఏమ్మైందో. ఇక అన్నీ మరచిపోయి నువ్వూ, బావా మా ఇంటికి వచ్చి ఓ వారం రోజులుండి వెళ్లండి' అన్నాడు తమ్ముడు.

'వద్దురా ఇంటికే వెళ్తాం' అంది.

అందరూ నచ్చజెప్పాలని చూసినా ఆమె మాత్రం తన పట్టు వీడలేదు.

సాయంత్రం అయ్యేసరికి ఇంటికి చేరుకున్నారు భార్యాభర్తలిద్దరూ.

జానకమ్మ మంచమ్మీద నిస్త్రాణగా ఒరిగింది. భార్యను ఆస్థితిలో చూస్తుంటే సీతారామయ్యకు, కోపం, బాధ ముంచుకొచ్చాయి.

'అదంటే మతిమాలి అద్దెకిస్తామంది. మరి నా తెలివేమ్మైంది' అప్పటికి వెయ్యిసార్లు అనుకున్నారు ఆయన.

'పిల్లలిద్దరూ చాలా మంచివాళ్లు. వాళ్లు నక్సలైట్లంటే నమ్మలేకున్నా' మళ్లీ అనుకున్నారు.

నాలుగు రోజులు గడిచాయి.

పొద్దున్నే వరండాలో కూర్చున్న జానికిరామయ్య ఎదురుగా కూర్చుంది జానకమ్మ. ఎప్పుడూ సవాళ్లు, ప్రతిసవాళ్లు, గిల్లికజ్జాలతో చిన్నపిల్లల్లా పోట్లాడుకుంటుండే వారిద్దరి మధ్యా చిక్కటి మౌనం...

అంతలో గేటు చప్పుడైంది. తిరిగి చూశారిద్దరూ. ఎదురుగా మధుమతి, శ్రీనివాస్. అవాక్కయ్యారు జానకమ్మ, సీతారామయ్య. వెర్రిగా చూస్తుండిపోయారు.

'అమ్మా' పిలిచింది మధుమతి. 'మేమిక్కడికి వచ్చింది. వున్నది అక్షరాలా ఉద్యమం కోసమే... ఇక్కడికి వచ్చాక మిమ్మల్ని మోసం చేస్తున్న ఫీలింగ్ మాలో ఏర్పడింది. మీ ప్రేమ మేము ఎంతో ఉన్నతంగా భావించే ఉద్యమాన్ని కూడా విడిచేలా చేసింది. అందుకే లొంగిపోయాం. మీకోసం వచ్చాం. మీరు వుండమంటే మీతోనే వుంటాం. లేదంటే వెళ్లిపోతాం. అయితే ఉద్యమంలోకి కాదు. ఇక్కడే వుంటూ సేవ చేస్తాం' అని చెప్పిందామె.

'మేము మిమ్మల్ని మోసం చేయలేదమ్మా.. ఉద్యమానికే చేశాం.. అందుకే వదిలి వచ్చేశాం..' చెప్పాడు శ్రీనివాస్.

నలుగురి కళ్లల్లోనూ నీళ్లు...

ముందు సీతారామయ్యే తేరుకున్నారు. ముందుకు అడుగు వేసి శ్రీనివాస్ చేయి పట్టుకున్నాడు.

'మీరెవరో మాకు తెలియదు. మీ గతం ఏమిటో మాకు అవసరమూ లేదు. పిల్లలకు దూరమ్మై అల్లాడుతున్న మా హృదయాలపై పన్నీరు చిలకరించారు. మీలోనే మా బిడ్డలను చూసుకుని తృప్తి పడ్డాం. మీ ఇద్దరూ వెళ్లిపోయిన తరువాత మేమనుభవించిన క్షోభ మాటలకందనిది. మీరూ అలాంటి బాధనే పడ్డారని తెలుస్తోంది. ఇన్ని రోజులూ అడవుల్లో నుంచి పోరాడారు. ఇక జనారణ్యం నుంచి మీ పోరాటాల్ని సాగించండి. మీ వెంట మేమూ వుంటాం. మనం చేసేది మంచి పనైతే ఇంకా చాలామందే కలిసి వస్తారు. అందరూ కలిసి మెరుగైన సమాజం కోసం కృషి చేద్దాం' అన్నారు.

జానకమ్మ ఫక్కున నవ్వింది. ఒక్కంగలో మధుమతి దగ్గరకు చేరుకుని గుండెల్లో పొదువుకుంది.

ఆ ఇంట్లో మళ్లీ వెన్నెల విరిసింది.

*



## ఎక్స్‌పోజింగ్‌కు గుడ్‌బై....

నమితను తలుచుకోగానే ఎక్స్‌పోజింగే గుర్తుకొస్తుంది. ఇప్పటి వరకూ ఎక్స్‌పోజింగ్ ద్వారా అభిమానులకు కనువిందు చేస్తున్న నమిత వారికి నిరాశ కలిగించనుంది. ఇటీవలే ఆమెకు జ్ఞానోదయం అయింది. ఇక మీదట ఎక్స్‌పోజింగ్‌కు దూరంగా ఉండాలని, నటనకు అవకాశం ఉన్న సినిమాలనే అంగీకరించాలని గట్టిగా నిర్ణయించుకుందట! ఈ నిర్ణయాన్ని కొన్ని సంవత్సరాల క్రితమే తీసుకున్నా, ఇటీవల దాన్ని గట్టిగా అమలు చేయాలనుకుంటోందట! ఈమేరకు ఒకటి రెండు అవకాశాలను కూడా వదులుకొందని సమాచారం. ఈ నిర్ణయం నమితకు ఎంత మాత్రం లాభం కలిగిస్తుందో తెలియదు కానీ, ఆమె అభిమానులు మాత్రం తెగ బాధపడిపోతున్నారు.